సాక్షి నిర్మల్

సోమవారం । 14 । ఆగస్టు । 2023

నేడు మాస్టర్‌ప్లాన్‌పై మహాధర్నా

నిర్మల్‌చైన్‌గేట్: కొత్త మాస్టర్‌ప్లాన్‌తో నష్టపోతున్న జిల్లా ప్రజలకు అండగా నిలిచేందుకు మాజీ ఎమ్మెల్యే, పార్టీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



టమాటా ధర తగ్గింది

కుంటాల: వారం క్రితం వరకు రూ.200 కిలో ధర పలికిన టమాటా క్రమేపీ దిగివచ్చింది. ఆదివారం కుంటాల సంతలో రూ.50కి కిలో విక్రయించగా, సాయంత్రం రూ.30కి పడిపోయింది.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

వరంగల్ ఎన్ఐటీకి భైంసా విద్యార్థి ఎంపిక



పుప్పాల వినయ్

భైంసాటౌన్: మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన పుప్పాల వినయ్ వరంగల్ ఎన్ఐటీలో సీటు సంపాదించాడు. జేఈఈ మెయిన్స్ విభాగంలో అత్యుత్తమ ర్యాంక్ సాధించడంతో ఈ మేరకు ఇటీవల నిర్వహించిన సెంట్రల్ సీట్ అలకేషన్ బోర్డ్ కౌన్సెలింగ్‌లో ఎంపికై బీటెక్ విభాగంలో సీటు పొందాడు. పదో తరగతి వరకు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చదవగా, ఇంటర్ నిజామాబాద్‌లో పూర్తి చేశాడు. ప్రతిష్టాత్మక వరంగల్ నిట్‌కు భైంసా మండల విద్యార్థి ఎంపిక కావడంపై గ్రామస్తులు, విద్యార్థి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

'ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరేయాలి'



జెండా ప్రదర్శిస్తున్న రమాదేవి, నాయకులు

భైంసాటౌన్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి కోరారు. ఆదివారం భైంసాలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయజెండాలను ప్రదర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'మేరా మిట్టి.. మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 10గంటలకు భైంసాలో తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక ఓం ప్రకాశ్‌లడ్డా ఫ్యాక్టరీ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా పాల్గొని ర్యాలీని విజయవంతం చే యాలని కోరారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ తదితరులున్నారు.

బీజేపీ సాధారణ సభ్యత్వానికి రాజీనామా

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ సాధారణ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మలగౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే జిల్లాలో ఓబీసీలు, మహిళలను ఐక్యం చేశామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మండల కమిటీలు వేసి, జిల్లా కమిటీ ఏర్పాటు చేసి బలమైన పార్టీగా తీర్చిదిద్దితే ఇటీవల కొందరు పార్టీ నేతలు ఒంటెత్తు పోకడలతో పార్టీలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు, కార్యకర్తలను కించపరుస్తూ అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వీరి చర్యలను పలుసార్లు సీనియర్ల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన రాలేదని తెలిపారు. ఇప్పటివరకు తమకు అన్ని విధాలుగా సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అలే భాస్కర్‌రాజ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

నిలకడగా 'కడెం' నీటిమట్టం



కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 (7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 689.925 (5.242టీఎంసీ) అడుగులుంది. ఎడమ కాలువకు 798, కుడి కాలువకు 6 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

అల్ఫోర్స్‌లో 'మస్త్' హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని మయూరి హోటల్‌లో ఆదివారం అల్ఫోర్స్ జూనియర్ కళాశాల మస్త్–2023 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను అన్ని వేళల్లో గమనిస్తూ.. ఉత్తమ స్థితికి చేర్చాలని సూచించారు. అనంతరం షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు డయల్–100, అత్యవసర సేవలు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, టోల్ ఫ్రీ నంబర్ 1930 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. షీ టీం ఎస్సై సుమంజలి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రహదారులు ఛిద్రం



కుభీర్: గొడ్సర వద్ద తెగిన రోడ్డు

- ఇటీవలి వర్షాలకు కోతకు గురైన రోడ్లు
- కొట్టుకుపోయిన వంతెనలు, కల్వర్టులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలోని చాలాచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. వంతెనలు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయమేర్పడింది. వర్షాలు తగ్గినా అధికారులు మరమ్మతులు చేపట్టడంలేదు. రహదారులను పునరుద్ధరించడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రమాదకరంగా మారిన రోడ్లు, వంతెనలపై వాహనాల్లో గ్రామీణులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రోడ్లు, వంతెనలకు తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని వేడుకుంటున్నారు.

కుభీర్ మండలంలో అస్తవ్యస్తం

కుభీర్: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా చోట్ల రోడ్లు తెగిపోయాయి. వివిధ గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులేర్పడ్డాయి. కుభీర్ నుంచి భైంసా వెళ్లే రోడ్డు రెండు చోట్ల తెగింది. గొడ్సర వద్ద 50 మీటర్ల మేర రోడ్డు కొట్టుకుపోయింది. సాంగ్వి బ్రిడ్జి వద్ద రోడ్డు కోతకు గురైంది. ఈ రూట్లలో బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. కుభీర్, భైంసా వయా కస్రామీదుగా వెళ్దామనుకుంటే కస్రా–సానారి మధ్య రోడ్డు తెగింది. అలాగే కుభీర్ పార్డి(బీ) మధ్య రోడ్డు కోతకు గురైంది. చాతా, హల్దా వెళ్లే రోడ్డు తెగింది. పార్డి(బీ) నుంచి మార్లగొండ వెళ్లే రోడ్డు కోతకు గురైంది. దార్‌కుభీర్, బెల్గాం గ్రామాల వద్ద



కుభీర్: దార్‌కుభీర్ వద్ద తెగిన కల్వర్టు

ఉన్న కల్వర్టులు తెగిపోయాయి. కుభీర్ నుంచి పల్సి వెళ్లే మార్గంలో పార్డి(కే) వద్ద రోడ్డు కోతకు గురైంది. సిర్పెల్లి వెళ్లే రోడ్డు గతేడాది కొంత కోతకు గురికాగా ఈసారి పూర్తిగా తెగింది. కుభీర్ నుంచి బెల్గాం వెళ్లే రోడ్డు గుంతలమయమైంది. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సారంగపూర్: మలక్‌చించోలి వంతెన కింది భాగంలో కోతకు గురైన రోడ్డు



సారంగపూర్: యాకర్‌పెల్లి రహదారిలో కోతకు గరైన రోడ్డు, కల్వర్టు

సారంగపూర్‌లో మరమ్మతులు మరిచారు

సారంగపూర్: మండలంలోని పలు రహదారులు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఛిద్రమయ్యాయి. యాకర్‌పెల్లి, జామ్–సారంగాపూర్ గ్రామాల మధ్య రోడ్డు కోతకు గురి కాగా మొరం పోయించి మరమ్మతులు చేపడుతున్నారు. కాగా, మళ్లీ వర్షం కురిసి వరద పోటెత్తితే ఇదే సమస్య పునరావృత్తం కానుంది. అధికారులు శాశ్వత పరిష్కారం చూపడంలేదు. పొట్య, పెండల్‌దరి, బండ్రేవుతండా తదితర రహదారులు కోతకు గురై ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మలక్ చించోలి గ్రామంలో స్వర్ణ నదిపై నిర్మించిన వంతెన ఒకవైపు కిందిభాగంలో కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీని పైనుంచి వాహనాలు వెళ్తే రోడ్డుకు బుంగపడి అందులోనే కూరుకుపోయే దుస్థితి నెలకొంది. జామ్ గ్రామం నుంచి యాకర్ పెల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురై రెండేళ్లయింది. గతంలో వరదలకు రోడ్డు కోతకు గురికాగా తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఇక్కడ చాలామంది ప్రయాణికులు పడి గాయాలపాలయ్యారు. తాజాగా ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత ప్రమాదకరంగా తయారైంది. పెండల్‌దరి–ఇప్పచెలిమ గ్రామాల మధ్య రహదారిపై నిర్మించిన లోలెవెల్ వంతెన కోతకు గురై నాలుగేళ్లయింది. 2019 ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన నాయకులు ఇదే వంతెన పై నుంచి ఆయా గ్రామాలకు వెళ్లారు. వంతెన మరమ్మతుపై దృష్టి సారించలేదు. ఇప్పచెలిమ గ్రామస్తులే కూలిన వంతెనపై మొరం పోయించుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ఏడాది వరదలకు పోసిన మొరం కొట్టుకుపోయి మళ్లీ అదే సమస్య పునరావృత్తం కాగా, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అప్పారావుపేట్ చెరువు ఉధృతంగా ప్రవహించగా వరదతో పొట్య గ్రామానికి వెళ్లే రహదారి చాలావరకు కోతకు గురైంది. కంకెట–వైకుంఠాపూర్ గ్రామాల మధ్య లోలెవల్ వంతెన కోతకు గురికాగా ప్రస్తుతం ఈ రహదారిలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేపడుతున్నాం

యాకర్‌పెల్లి రహదారిపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. కంకెట, బండ్రేవుతండా రహదారులకు మరమ్మతులు చేపట్టాం. పెండల్‌దరి వంతెనకు ఐటీడీఏ నుంచి జీవో 9లో మంజూరు వచ్చింది. ఇంకా పనులు ప్రారంభించలేదు. ఇతర గ్రామాల్లో రోడ్లు కోతకు గురైన విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. తాత్కాలిక మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నాం.

– శరత్, పీఆర్ జేఈ, సారంగపూర్

మరమ్మతులు చేపట్టాలె



కుభీర్ మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు తెగిపోయినయ్. పలుచోట్ల గుంతలు ఏర్పడ్డయ్. ఈ రోడ్లపై వాహనాలు నడవడం లేదు. రవాణా సౌకర్యం లేక రాకపోకలకు ఇబ్బందులేర్పడుతున్నయ్. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలె.

– సుంకరి సాయినాథ్, పార్డి(కె)

ఇబ్బందులు పడుతున్నం



గతేడాది తెగిపోయిన సిర్పెల్లి, పార్డి(బీ) రోడ్లకు మరమ్మతు చేపట్టకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా తెగిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. ప్రభుత్వం రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి మా ఇబ్బందులు దూరం చేయాలె.

– గంగాశేఖర్, కుభీర్

రోడ్లపై సర్వే చేశాం

వర్షాల తర్వాత కుభీర్ మండలంలో కొట్టుకపోయిన రోడ్లపై సర్వే నిర్వహించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అవసరమైన చోట తాత్కాలిక మరమ్మతులు చేపట్టాం. మరి కొన్నిచోట్ల పనులు కొనసాగుతున్నాయి.

– రఘు, ఆర్అండ్‌బీ ఏఈ, కుభీర్

ఐకమత్యంతోనే హక్కుల సాధన



సమావేశంలో మాట్లాడుతున్న మారయ్య

లక్ష్మణచాంద: ఐక్యతతో హక్కులు సాధించుకోవాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని డీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్ అధ్యక్షతన లక్ష్మణచాంద, మామడ మండలాల కులస్తులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలో హైదరాబాద్‌లో లక్ష మందితో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరలకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. వడ్డెర సంఘం జేఏసీ రాష్ట్ర చైర్మన్, కవి, రచయిత దండి వెంకట్ మాట్లాడుతూ.. వడ్డెరలను వెంటనే ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. సంక్షేమ హాస్టళ్ల నిర్మించాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు దండ్ల శేఖర్, గురవయ్య, గంగాధర్, సాయిలు, రాజేశ్, శ్రీనివాస్, మారుతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ పరిరక్షణ చట్టాన్ని రద్దుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భీంరావు

ఖానాపూర్: గిరిజనుల ఉనికికి ఆటంకంగా మారిన అటవీ పరిరక్షణ చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోడసం భీంరావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ముగింపు సభకు హాజరై మాట్లాడారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని 29 ఏళ్లుగా నిర్వహిస్తున్నా నేటికీ అధికారికంగా నిర్వహించలేదని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పడ్డ చట్టాలను కూడా కేంద్ర ప్రభుత్వం మారుస్తోందని తెలిపారు. నూతన అటవీ పరిరక్షణ చట్టంతో గిరిజన హక్కులు, చట్టాలు నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం పోరాటాలతోనే ప్రభుత్వం దిగివచ్చి అటవీ హక్కుపత్రాలు ఇచ్చిందని తెలిపారు. జిల్లా కార్యదర్శి తోడసం శంభు, నాయకులు కాత్లే లింబారావు, అర్క మారుతి, మెస్రం నాగోరావు, కుంరం దేవరావు, నైతం రాజు, పుర్క రవీందర్, మెస్రం సుమిత్ర, దాంబాయి, దుర్గం నూతన్, నాగెల్లి నర్సయ్య, బొమ్మెన సురేశ్, మాడావి లింగు, ఆత్రం రాజేందర్, భీంరావు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీగార్డుల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంజాల వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సెక్యూరిటీ గార్డుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న తమకు ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. జీవో 21ని వెంటనే అమలు చేయాలని, ఏకరూప దుస్తులు ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు సంఘం ఆధ్వర్యంలో గద్దర్‌కు నివాళులర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీ చంటి, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాడి గంగారాం, జీ పొచ్చన్న, నిర్మల్ అధ్యక్ష, కార్యదర్శులు షోయబ్ హుస్సేన్, బీ గంగాధర్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల అధ్యక్షుడు పీ రమేశ్, కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు షేక్ ఫహీం, కరిపె రాజేందర్, పోశెట్టి, జనార్దన్, వెంకన్న, రమేశ్, నిరంజన్ ఉన్నారు.



సమావేశానికి హాజరైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని సెక్యూరిటీ గార్డులు

ట్రిపుల్‌ఐటీలో తిరంగా ర్యాలీ



జాతీయ జెండాలతో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

భైంసా: యుజీసీ ఆదేశాల మేరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బాసర ట్రిపుల్ ఐటీలో ఆదివారం హరఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్పోర్ట్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉద్యోగులు జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్నారు. శాతవాహన గ్రౌండ్ నుంచి ఎకో పార్క్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు దారి పొడవునా నినాదాలు చేశారు. వీసీ వెంకటరమణ, ఎస్సై గణేశ్, చీఫ్‌వార్డెన్ డాక్టర్ మధుసూదన్, అధ్యాపకులు అజయ్, విఠల్, వినోద్, రాకేశ్ తదితరులున్నారు.

'వ్యాసరచన'లో హెచ్‌ఎంకు రాష్ట్రస్థాయి బహుమతి



బహుమతి అందుకుంటున్న భూమన్నయాదవ్

తానూరు: మండలంలోని ఎల్వి జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం భూమన్నయాదవ్‌కు వ్యాసరచన పోటీల్లో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి లభించింది. స్త్రీహస్తిన మహిళా మండలి, జాగృతి అభ్యుదయ సంఘం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 'పర్యావరణ పరిరక్షణ.. నావంతు పాత్ర' అనే అంశంపై ఈ నెల 1నుంచి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో భూమన్నయాదవ్ పాల్గొని ప్రతిభ చూపారు. రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని వెంకటేశ్వరస్వామి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌గుప్తా, హస్తిన చైర్మన్ ఎరంపూర్ణ శాంతిగుప్తా చేతుల మీదుగా బంగారు పతకంతోపాటు ప్రశంసాపత్రం అందుకున్నారు.

సదర్మాట్‌కు నీటి విడుదలెప్పుడో..!



దిలావర్‌పూర్ శివారులో నీరు లేక వెలవెలబోతున్న కాలువ

- కాలువలకు పలుచోట్ల గండ్లు
- అయోమయంలో అన్నదాతలు
- నార్లు ఎండడంపై ఆందోళన



దిలావర్‌పూర్ శివారులో బీళ్లుగా భూములు

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల్లోని సదర్మాట్ ఆయకట్టుకు వానాకాలం సాగుకు నీటి విడుదలపై సందిగ్ధత నెలకొంది. ఆయా మండలాల్లోని 12వేల మందికి పైగా రైతులు సాగునీరు ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూస్తున్నారు. గతంలో యాసంగి సాగుకు మాత్రమే నీటి కోసం ఎదురుచూసేవారమని, రెండేళ్లుగా వానాకాలం కూడా నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఏటా జూలై రెండోవారంలో వానాకాలం సాగుకు అందాల్సిన నీరు నేటికీ రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గతేడాది కూడా పాత ఎల్లాపూర్ వద్ద సదర్మాట్ కాలువ అండర్ టన్నెల్ దెబ్బతిని, దీని పరిధిలోని గ్రామాలకు చెందిన అనేకమంది రైతులు నీరందక సాగు చేయలేదు. ఆలస్యంగా సాగుచేసిన వారిలో సగం మందికి కూడా దిగుబడి రాక నష్టపోయారు. ఈ ఏడాది కూడా అప్పటి పరిస్థితులు తలెత్తకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. రైతుల పరిస్థితి 'అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుని నోట్లో శని' అన్న చందంగా మారింది. పుష్కలంగా గోదావరిలో నీరున్నా వాటిని పంటచేళ్లకు తెచ్చుకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు.

ఆందోళనలు చేసినా..

20రోజుల క్రితం కురిసిన భారీవర్షాలతో గాంధీనగర్ శివారులోని కాలువకు రెండుచోట్ల గండ్లు పడ్డాయి. పలుచోట్ల కాలువ దెబ్బతిని సాగునీరు వెళ్లలేని విధంగా మారింది. దీంతో రైతులు పలుసార్లు ఆందోళనలు చేశారు. ప్రజాప్రతినిధులకు విన్నవించారు. ఇటీవల సదర్మాట్ అధికారిని నిలదీశారు. ఖానాపూర్ బస్టాండ్ సమీపంలో కాలువ షెట్టర్లు మూసి వేయగా మస్కాపూర్, సుర్జాపూర్ ప్రాంతంలోని వారికి మాత్రమే నార్లకు సరిపడా నీరు వస్తుందని, తమ నార్లు ఎండిపోతున్నాయని ఖానాపూర్, తిమ్మాపూర్ ప్రాంతానికి చెందిన పలువురు రైతులు మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గాంధీనగర్ సమీపంలోని కాలువకు మాజీ ఎంపీ రూ.30వేల సొంత ఖర్చులు వెచ్చించి అడ్డుకట్ట వేశారు. దీంతో నార్లకు సరిపడా నీరందుతోంది.

ప్రాజెక్ట్‌లో నీరున్నా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో పుష్కలంగా నీరున్నా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఖానాపూర్, కడెం మండలాల్లోని మస్కాపూర్, సుర్జాపూర్, ఖానాపూర్ ప్రాంత రైతుల నార్లకు మినహా మిగతా ఎవరికీ చుక్క నీరు రావడం లేదు. మండలంలోని దిలావర్‌పూర్, కొత్తపేట్, బావాపూర్, గొడలపంపు, గోసంపల్లె, పాత ఎల్లాపూర్‌తో పాటు కడెం మండలంలోని గ్రామాలకు నీరువెళ్లడం లేదు. ఇటీవల ఆయాచోట్ల రైతులు నార్లు పోసినప్పటికీ నీరు రాక భూములు బీళ్లుగానే ఉన్నాయి. నార్లు కూడా ఎండిపోవడంతోపాటు ముదిరిపోతున్నాయి. దీంతో సకాలంలో నీరు రాకుంటే నార్లు కూడా పశువుల పాలు కానున్నట్లు రైతులు వాపోతున్నారు. యాసంగిలో తగ్గిన దిగుబడిని వానాకాలం పంటతో పూడ్చుకోవాలని చూసిన రైతుల ఆశ నిరాశే అయింది.

15వ తేదీలోగా పనులు పూర్తిచేస్తాం

సదర్మాట్ కాలువ పరిధిలో పడిన గండ్లు పూడ్చే పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ప్రధాన పనంతా పూర్తయింది. చిన్నపాటి పనులు కూడా 15వ తేదీలోగా పూర్తవుతాయి. పనులు పూర్తికాగానే నీటిని అందిస్తాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– ఉదయ్, ఏఈఈ, సదర్మాట్

క్లుప్తంగా

బాసరలో భక్తుల రద్దీ


బారులు తీరిన భక్తులు

భైంసా: బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆదివారం సెలవు దినం కావడంతో మహారాష్ట్రతోపాటు తెలంగాణ నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు గోదివరి నదిలో పుణ్యస్నానాలు అచరించి తెప్పలు వదలి మొక్కలు చెలించుకున్నారు.

కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య

తలమడుగు: కడుపునొప్పి భరించలేక బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై ధనశ్రీ కథనం ప్రకారం.. మండలంలోని లాల్‌ఘడ గ్రామానికి చెందిన కుడిమేత శైలజ (16) గత ఆరునెలల నుంచి కడుపు నొప్పితో బాధపడుతోంది. ఇటీవల శస్త్రచికిత్స చేసుకున్నా కడుపునొప్పి తగ్గలేదు. దీంతో మనస్తాపంతో ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. శనివారం రాత్రి పక్కా సమాచారంతో పేకాటస్థావరంపై దాడి చేసి ఐదు బైక్‌లు, వారి వద్ద రూ.12,900 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

ఆటోబోల్తా

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతంలో జాతీయ రహదారిపై ఆదివారం ఆటోబోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. కూలీలు తమ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా బోల్తా పడింది. గాయపడిన వారిని స్థానికులు రిమ్స్‌కు తరలించారు. ఈ విషయంపై ఎస్సైని ×సాక్షి°సంప్రదించగా ఆటో బోల్తా పడిన విషయం వాస్తవమేనని, ఇంకా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు

బెజ్జూర్(సిర్పూర్): అడవిపంది దాడిలో ఒకరు గాయాలపాలైన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పెద్ద సిద్దాపూర్ గ్రామానికి చెందిన మేస్త్రం సాంబయ్య పంటచేనుకు వెళ్లి వస్తుండగా గొల్లబాయి చెరువు సమీపంలో అడవిపంది దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో అడవిపంది పారిపోయింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మ్యారేజ్ బ్యూరో నందు పనిచేయుటకు అమ్మాయి కావలెను. చదువుతో నిమిత్తం లేకుండా మంచి వాక్చాతుర్యం గల నమ్మకంతో పనిచేసే అమ్మాయి కావలెను. 8341220970 [K-1185575]

■ లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K, ఏజెంట్ కమీషన్8K ఫోన్: 9640400073 [HA-189320]

■ ప్రముఖ బ్యాంకులలో కం॥ఆపరేటర్స్ /క్లర్క్స్ /అటెండర్స్ /ఆఫీస్ అసిస్టెంట్స్ / అకౌంటెంట్స్/ క్యాషియర్స్. Q: 10th-PG ఆకర్షణీయమైన జీతం. 9492881006 [G-7496]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

గంజాయి మత్తులో యువత

బోథ్ మండలంలో గంజాయికి అలవాటుపడ్డ కొందరు యువకులు చెట్ల పొదలు, చెట్ల పైన కుండీలు పెట్టి మరీ గంజాయి మొక్కలు పెంచుతున్నారు. ఇటీవల సాయినగర్ కాలనీకి అనుకుని ఉన్న ఓ వెంచర్‌లో ఉన్న చెట్టుపై కుండీలు అమర్చి గంజాయి మొక్కలు పెంచారు. ఎవరికీ అనుమానం రాకుండా ఇలా చేస్తున్నారు.



బోథ్‌కు చెందిన ఓ యువకుడు గుట్టుచప్పుడు కాకుండా పలువురికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ షాపు నడుపుతున్న ఆ యువకుడికి పల్లెల నుంచి గంజాయి తీసుకువస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి కుమారుడు సైతం గంజాయికి అలవాటుపడినట్లు తెలుస్తోంది.

2022 డిసెంబర్ 28న ఆదిలాబాద్‌లోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో గంజాయిని విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. హైదరాబాద్‌లో తన స్నేహితులకు గంజాయిని తీసుకువచ్చేందుకు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మరో యువకుడి వద్ద గంజాయిని తీసుకున్నాడు. వారం పాటు హైదరాబాద్‌లో గంజాయి విక్రయించాడు. ఈ క్రమంలో ఎక్సైజ్ అధికారులు పట్టుకుని, అతని వద్ద నుంచి 1.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

- చెట్లపొదల్లో మొక్కల పెంపకం
- హైదరాబాద్‌లోని పబ్‌లకు చేరవేస్తూ..
- ఇటీవల విక్రయిస్తూ పట్టుబడ్డ ఆదిలాబాద్ యువకుడు
- వాచ్‌మెన్‌లుగా పనిచేస్తూ విక్రయాలు

బోథ్: జిల్లా వ్యాప్తంగా గంజాయి యథేచ్ఛగా సరఫరా అవుతోంది. చాలా గ్రామాల్లోని యువతకు గంజాయి సులభంగా చేరుతోంది. 10వ తరగతి మొదలుకుని విద్యార్థులు, యువకులతోపాటు పలువురు గంజాయికి బానిసలవుతున్నారు. మండల కేంద్రంలోని కల్లుబట్టీ వద్ద, రాత్రి వేళల్లో స్థానిక పాత ప్రభుత్వ కళాశాల భవనం, జూనియర్ కళాశాల, పిప్పల్‌ధరి రోడ్డు, పెద్ద వాగు సమీపాన, మోడల్ స్కూల్ వెనుక భాగం, పలు వెంచర్లల్లో గంజాయిని సేవిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇతర ప్రాంతాలకు సరఫరా..

ఆదిలాబాద్ జిల్లాలో కొందరు యువకులు గంజాయిని హైదరాబాద్, ముంబయి ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. బ్యాగుల్లో గుట్టుచప్పుడు కాకుండా తీసుకెళ్తున్నారు. బ్యాగుల నుంచి వాసన రాకుండా సెంట్ కొడుతున్నారు. అనుమానం రాకుండా ఒక వారం బస్సు, మరోవారం కారులో వెళ్తున్నారు. ఒక వారం నిర్మల్ నుంచి హైదరాబాద్‌కి వెళ్తే మరో వారం ఆదిలాబాద్‌లో బస్సు ఎక్కుతున్నారు. అటు ప్రైవేట్ బస్సుల్లోనూ వెళ్తున్నారు. మరోవైపు ముంబయికి ప్రత్యేకంగా కార్లలో గంజాయిని తీసుకెళ్తున్నారు. అక్కడ ఉన్న వాచ్‌మెన్‌లుగా, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వ్యక్తులకు గంజాయిని చేరవేసి ఇంటికి తిరుగుపయనమవుతున్నారు. ప్రతి వారం గంజాయి సరఫరా కొనసాగుతోంది. హైదరాబాద్‌లో ఉంటున్న వారు గంజాయిని తీసుకుచ్చే యువకులు వారానికి రూ.4 వేలు ఇస్తున్నారు. ఈ తతంగం గత కొన్నేళ్లుగా సాగుతోంది. గంజాయిని రవాణా చేసే వాళ్లలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులే ఉండటం ఆందోళన కల్గిస్తోంది.

వాచ్‌మెన్‌లుగా పనిచేస్తూ..

జిల్లాలోని నేరడిగొండ, బోథ్, బజార్‌హత్నూర్, సిరికొండ, గుడిహత్నూర్ మండలాలు, ఇతరచోట్ల నుంచి యువకులు హైదరాబాద్‌లోని అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్‌లు, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. వీరంతా 18 నుంచి 35 ఏళ్లలోపు యువకులే. అక్కడ ఉద్యోగాలు చేస్తూ పబ్‌ల్లో ఉండే ఏజెంట్లతో గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. తమ పల్లెల్లో అంతరపంటగా సాగు చేస్తూ వారి బంధువులు, స్నేహితుల ద్వారా ఇతర ప్రాంతాలకు తెప్పించుకుంటున్నారు. వీటి ద్వారా వచ్చే డబ్బుతో జల్సాలు చేస్తూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

జిల్లాలో ఇప్పటివరకు పట్టుబడ్డ గంజాయి కేసులు

సంవత్సరం	నమోదైన కేసులు	అరెస్టయినవారు
2020	12	31
2021	13	30
2022–23	14	17

కొన్ని ఘటనలు..

- గతంలో బోథ్ మండలంలోని ఓ గ్రామంలో హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు గంజాయిని కొనుగోలు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.
- గత 18 నెలల క్రితం బోథ్ మండలం పట్నాపూర్‌లో 109 గంజాయి మొక్కలు పట్టుకుని ధ్వంసం చేశారు.
- బోథ్ మండలం పార్డి(కె) గ్రామంలో 2 కిలోల డ్రై గంజాయిని పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదైంది.
- గతేడాది బజార్‌హత్నూర్ మండలంలోని మంజీరతండాలో 7 కిలోల గంజాయిని పట్టుకున్నారు.
- నేరడిగొండ మండలం కుప్టిలో ఆటోలో తరలిస్తున్న 2 కిలోల గంజాయిని పట్టుకున్నారు.
- గత జూన్ 19న ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద 500 గ్రాముల పొడి గంజాయిని పట్టుకున్నారు.

భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు



యువకులు గంజాయికి అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. ఎవరైనా గంజాయిని అక్రమంగా తరలించినా.. సాగు చేసినా వారిపై కేసులు నమోదు చేస్తాం. యువకులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతాం. గంజాయి రవాణాపై నిఘా పెంచాం. గంజాయి మొక్కలు పెంచితే కేసులు నమోదు చేస్తాం.
– భీమేశ్ సీఐ, బోథ్

బావిలో పడి వృద్ధురాలి మృతి


రాజవ్వ మృతదేహం

కడెం: ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై భీంరావు కథనం ప్రకారం.. మండలంలోని లింగాపూర్‌కు చెందిన బోయిని రాజవ్వ (80) ఆదివారం తెల్లవారుజాము కాలకృత్యాలకని నిద్రలేచింది. ఇంటి పక్కనే ఉన్న బావిలో నుంచి నీటిని చేదే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. కుమారుడు వెంకట్రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరు..


శ్రీనివాస్ (ఫైల్)

లోకేశ్వరం: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతిచెందాడు. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పోతరాజు శ్రీనివాస్(38) శనివారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు పోచమ్మ చెరువు వద్దకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోయేసరికి ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. చెరువు వద్దకు వెళ్లగా ఆయన అనవాళ్లు కనిపించాయి. ఆదివారం ఉదయం మృతదేహం లభ్యమైంది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు ఒకరు..

గుడిహత్నూర్: మండలంలోని ముత్నూరు గ్రామానికి చెందిన ఫైటనే గౌతమ్ (55) పాముకాటుకు గురై మృతిచెందాడు. శనివారం ఉదయం ఇంటి పెరట్లో గడ్డి తీస్తుండగా గౌతమ్‌కు పాము కాటేసింది. దీంతో ఆయన నాటు వైద్యం తీసుకున్నాడు. ఎంతకీ నయం కాకపోవడంతో కుటుంబీకులు మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఆయన పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి 10:30 గంటల సమయంలో మృతి చెందినట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సోనేరావుపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద ఆదివారం రాస్తారోకో చేపట్టారు. దాడి చేసిన వారిని అరెస్టు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. పలువురు కొలాం సంఘం నేతలు మాట్లాడుతూ సోనేరావుపై దాడిని ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీ తెగలపై ఆధిపత్యం కోసం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నాయకులు మిగతా తెగలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. కొన్ని తెగలకు రక్షణ లేకుండా చేస్తూ ఆదివాసీల హక్కులు కాలరాస్తున్నా తుడుందెబ్బను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్, రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పొచ్చయ్యలు వెంటనే సొనేరావ్‌కు క్షమాపణ


రాస్తారోకో చేస్తున్న నాయకులు, తదితరులు

చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే కొలాం సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీంరావ్, గౌరవ అధ్యక్షుడు టేకం భాస్కర్, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావ్, నాయకులు బాలేరావ్, లక్ష్మణ్, రాజు, లక్ష్మీబాయి, రాధబాయి, ముకుంద్‌రావ్, గణేశ్ పాల్గొన్నారు.

తుడుందెబ్బ జిల్లా కమిటీ రద్దు చేయాలని ఆందోళన


రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

నార్నూర్: తుడుందెబ్బ జిల్లా కమిటీని వెంటనే రద్దు చేయాలని ఆదివాసీలు ఆందోళనకు దిగారు. గాదిగూడ మండలం లోకారి(కే) గ్రామంలోని కుమురం భీం చౌక్ వద్ద ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో ఎంపీ సోయం బాపూరావు దిష్టిబొమ్మ దహనం చేయడం సిగ్గుచేటన్నారు. కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావుపై కొందరు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఆదివాసీ సమాజంలో రాయి సెంటర్, గ్రామ పటేల్ వ్యవస్థలు పటిష్ఠంగా ఉందన్నారు. ఏదైనా అంతర్గత విభేదాలు ఉంటే కూర్చుని మాట్లాడుకోని సమస్య పరిష్కరించుకోవాలన్నారు. ఝరి రాయి సెంటర్ సార్‌మేడి మండాడి దౌలత్‌రావు, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు పూసం బాదిరావు, కొలాం సంఘం మండల అధ్యక్షుడు కొడప కాను, గ్రామ పటేల్ మెస్రం సోము, డాబా పటేల్ కుమ్ర పైకు, విద్యార్థి నాయకుడు పెందూర్ సంతోష్ ఉన్నారు.

పోషకాల గని డ్రాగన్ ఫ్రూట్

- సాగుకు ముందుకొచ్చిన ప్రభుత్వ టీచర్
- కరోనా, లాక్‌డౌన్‌లో యూట్యూబ్‌లో అధ్యయనం
- 1.25 ఎకరాల్లో రూ.8 లక్షల ఖర్చుతో సాగు
- ఒక్కో మొక్కకు రూ.100 చెల్లింపు

జైనథ్: సంప్రదాయ పంటలకు విసిగిపోయిన ప్రభుత్వ టీచర్..విదేశాల్లో పండిస్తున్న డ్రాగన్ ఫ్రూట్‌తో ఆదాయం పొందాలని దీన్ని సాగుకు శ్రీకారం చుట్టాడు. అతనే ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కౌఠ గ్రామానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు భోయర్ ప్రశాంత్. డ్రాగన్ ఫ్రూట్‌లో ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు ఉండడంతో సాగు చేసి లాభాలు గడిస్తున్నాడు. కరోనా, లాక్‌డౌన్‌లో దీని గురించి యూట్యూబ్, ఇతర మాధ్యమాల విస్తృతంగా అధ్యయనం చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, మహారాష్ట్రలోని సోలాపూర్ నుంచి ఒక్కొక్క మొక్కకు రూ.100 నుంచి 150 చెల్లించి మొత్తం రూ.3 లక్షలతో జంబో, మారథాన్ రెడ్, అమెరికన్ జ్యూసీ వెరైటీలకు చెందిన 2400 మొక్కలు తెప్పించి కౌఠ గ్రామంలోని తన చేనులో 1.25 ఎకరాల్లో నాటాడు. మొత్తం పంట కోసం ఇప్పటివరకు రూ.8లక్షలు ఖర్చు చేయగా, ప్రస్తుతం కాత ప్రారంభం కావడంతో మంచి దిగుబడులు వస్తున్నాయి.


డ్రాగన్ ఫ్రూట్

ఏడాదిలో ఆరు నెలలు కాతనే..

తక్కువ శ్రమతో దీర్ఘకాలంపాటు అధిక లాభాలు తెచ్చిపెట్టే డ్రాగన్ ఫ్రూట్ సాగుకు భోయర్ ప్రశాంత్ ముందుకొచ్చాడు. ఒక్కసారి పంట వేస్తే 25 ఏళ్లపాటు, ఏడాదికి ఆరు నెలలు కాత వస్తుంది. అనుకున్నట్లే ఏడాది తర్వాత కాత ప్రారంభమైంది. ఇప్పటికే 200 కిలోల పండ్లు కోత కోయగా స్థానికంగా మార్కెట్‌లో కిలో రూ.150–160 ధర పలికింది. దీనికి తోడు ఆర్గానిక్ సాగు చేయడంతో మంచి ఆధరణ లభిస్తోంది. మొదటి కాత కావడంతో ఒక్కొక్క ఫ్రూట్ అర కిలో వరకు సైజ్‌లో వస్తోంది. ఈ ఏడాది మొత్తం దాదాపు ఒక టన్ను దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి 5–8 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని ప్రశాంత్ చెబుతున్నారు. ఈ పంటకు వర్మీ కంపోస్ట్, జీవామృతం సేంద్రియ ఎరువులతోపాటు చాలా తక్కువ ధరకు లభించే ట్రైకోడెర్మా, సూడోమోనస్ వంటి శిలీంద్రాలను పంటకు ఎరువుగా వేయాలి. ఏడాదికి రూ.50వేలు మాత్రమే ఖర్చవుతాయని చెబుతున్నాడు.

డ్రాగన్ ఫ్రూట్‌కు డిమాండ్



మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్ కిలో రూ.200 వరకు ఉంది. కిలో రెండు మాత్రమే వస్తాయి. ఈ ఫ్రూట్ పండిస్తే రైతులు మంచి లాభాలు ఆర్జించవచ్చు. ఎకరాకు రూ.6–7లక్షలు పెట్టుబడి పెడితే దాదాపు 25 ఏళ్ల పాటు కాత వస్తుంది. డ్రాగన్ ఫ్రూట్‌లకు చాలా డిమాండ్ ఉండటంతో మొదటి రెండేళ్లల్లో పెట్టుబడి తిరిగి వస్తుంది. ఈ ఏడాది నా చేన్లో ఒక టన్ను దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నా. జిల్లాలో మొదటగా నేనే సాగు చేశా. ప్రస్తుతం అక్కడక్కడ డ్రాగన్ ఫ్రూట్ సాగు మొదలైంది.
– భోయర్ ప్రశాంత్

ఫుట్‌బాల్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి మెన్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా ప్రతిభ కనబరిచిన 20 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 16 నుండి 20 వరకు వనపర్తి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు పాల్గొంటుందని ఆయన పేర్కొన్నారు.

‘బీసీ గర్జన పేరిట కాంగ్రెస్ మోసం’

జన్నారం: ఇంతకాలం బీసీలను పట్టించుకోని కాంగ్రెస్ బీసీ గర్జన పేరిట బీసీలను మోసం చేయడానికి మరోసారి కుట్ర పన్నుతోందని బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య ఆరోపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నిర్వహిస్తున్న బీసీ గర్జన కార్యక్రమాన్ని సమితి బహిష్కరిస్తుందన్నారు. 75 సంవత్సరాల కాలంలో ఏనాడు బీసీలను పట్టించుకోని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో బీసీ భజన చేయడం విడ్డూరమన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించే విషయంలో కాంగ్రెస్ మాట్లాడక పోవడం సరికాదన్నారు. సమావేశంలో గంగాధర్, భాస్కర్ గౌడ్, శ్రీనివాసగౌడ్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో అట్టహాసంగా గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లు అందజేస్తున్న రిమ్స్ డైరెక్టర్

- ఎంబీబీఎస్ పూర్తి చేసిన మెడికోలకు సర్టిఫికెట్ల ప్రదానం

ఆదిలాబాద్: రిమ్స్‌లో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే అట్టహాసంగా జరిగింది. మెడికోల కేరింతలు, చప్పట్ల మధ్య రిమ్స్‌లో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఇటీవల వాగులోపడి మృతి చెందిన పీజీ వైద్యవిద్యార్థి బుక్య ప్రవీణ్ కుమార్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు. అనంతరం వైద్యకోర్సు పూర్తి చేసిన 2017 బ్యాచ్ మెడికో విద్యార్థులకు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుడిగా మంచి గుర్తింపు తెచ్చుకొని పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం పట్టాలు పొందిన మెడికోలు వైద్యవృత్తికి న్యాయం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇద్రిస్ అక్బాని, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విద్యవిల్సన్, ఆయా విభాగాల హెచ్‌ఓడీలు, వైద్యులు, మెడికోలు తదితరులు పాల్గొన్నారు.

కూలిన కంపెనీ క్వార్టర్ పైకప్పు

- తృటిలో తప్పిన ప్రమాదం


కూలిన పైకప్పు

రామకృష్ణాపూర్(చెన్నూర్): బీజోన్ ఏరియాలోని సింగరేణి బీ–21 క్వార్టర్స్‌లో ఉన్నట్టుండి ఒక్కసారిగా పైకప్పు కూలింది. ఆర్కే ఓసీలో అండర్ మేనేజర్‌గా పనిచేస్తున్న రవికిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాగా ఈ క్వార్టర్‌లోని బెడ్ రూంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. అప్పటివరకు అదే గదిలో ఉన్న కుటుంబసభ్యులు అప్పుడే వేరే గదికి వెళ్లడంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. గదిలోని కంప్యూటర్‌తో పాటు ఇతర సామగ్రి ధ్వంసమైంది. విషయం తెలిసిన వెంటనే ఏరియా జీఎం మోహన్‌రెడ్డి, ఇతర సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులు క్వార్టర్‌ను పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.